నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 నిజామాబాద్, మంగళవారం 18 జూన్ 2024 NIZAMABAD


## ఏడో బెటాలియన్ కమాండెంట్‌గా రోహిణి ప్రియదర్శిని



వినాయక్‌నగర్, జూన్ 17: నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి ఏడో బెటాలియన్ కమాండెంట్‌గా రోహిణి ప్రియదర్శినిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 28మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఆర్డర్స్ వెలువరించారు. ఇప్పటి వరకు ఏడో బెటాలియన్ కమాండెంట్‌గా విధులు నిర్వర్తించిన బి.రామ్ ప్రకాశ్‌ను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఆయన స్థానంలో 2012 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన, ప్రస్తుతం హైదరాబాద్ నార్త్ జోన్ డీసీపీగా ఉన్న రోహిణి ప్రియదర్శిని బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీపై వస్తున్నారు. బదిలీపై వస్తున్న రోహిణి ప్రియదర్శిని నిజామాబాద్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కల్మేశ్వర్ సింగేనవార్ సతీమణి కావడం విశేషం.



బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కేఆర్ సురేశ్‌రెడ్డి, పక్కన రాజ్యసభసభ్యుడు దామోదర్ రావు దీవకొండ


## బీఆర్‌ఎస్ రాజ్యసభపక్ష నేతగా కేఆర్ సురేశ్‌రెడ్డి

### హర్షం వ్యక్తంచేసిన బీఆర్‌ఎస్ నాయకులు

మోర్తాడ్, జూన్ 17: బీఆర్‌ఎస్ రాజ్యసభాపక్ష నేతగా నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి గ్రామానికి చెందిన కేతిరెడ్డి సురేశ్ రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు మాజీ సీఎం కేసీఆర్ నియామకపత్రాన్ని సోమవారం సురేశ్‌రెడ్డికి అందజేశారు. కేఆర్ సురేశ్ రెడ్డి రాజకీయ కుటుంబం నుంచి వచ్చినా కింది స్థాయి నుంచి పైకి ఎదిగారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా సురేశ్ రెడ్డి రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. నాలుగుసార్లు బాల్కొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అందులో ఐదేండ్లు స్పీకర్‌గా పనిచేశారు. గత నాలుగేండ్లుగా రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. రాజ్యసభాపక్షనేతగా ఉన్న కేశవరావు బీఆర్‌ఎస్ నుంచి వెళ్లిపోవడంతో సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సురేశ్‌రెడ్డిని నియమిస్తామని గతంలో విలేకరుల సమావేశంలో కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రకటించిన విధంగానే కేఆర్ సురేశ్‌రెడ్డిని రాజ్యసభపక్ష నేతగా ప్రకటించడంతో బాల్కొండ బీఆర్‌ఎస్ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. తనను పార్లమెంటరీ నేతగా ప్రకటించడంపై సంతోషం వ్యక్తంచేస్తూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను సురేశ్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

వరుణదేవా.. కరుణించవా!

# జాడలేని చినుకు



ఉమ్మడి జిల్లాలో లోటు వర్షపాతం

- వానాకాలం సాగులో రైతుల ఆగచాట్లు
- నిరాశాజనకమైన వానలతో కర్షకులకు పాట్లు
- సాగుబడిలో కానరాని ప్రభుత్వ సహకారం
- అరకొర వానలతో రైతులు తొందరపడొద్దంటున్న నిపుణులు



బోధన్ మండలం రాజీవ్‌నగర్ తాండలో వర్షాలు కురువాలని పూజలు చేస్తున్న గ్రామస్తులు

**వానాకాలం ప్రారంభంతోనే** రైతులకు కష్టాలు మొదలయ్యాయి. అష్టకష్టాలతో యాసంగి సీజన్‌ను దాటుకొని ముందుకు వచ్చిన కర్షకులకు మరోసారి ఉపద్రవం ముంచుకొస్తోంది. వర్షాకాలం మొదలై మూడు వారాలు కావొస్తున్నప్పటికీ వర్షాలు ఆశించిన స్థాయిలో కురువలేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చాలా చోట్ల లోటు వర్షపాతమే నమోదైంది. దీంతో నీటి జాడ లేక సాగులో అన్నదాతలంతా తడబాటుకు గురవుతున్నారు. ఏం చేయాలో తెలియక వరుణదేవా... కరుణించవా... అంటూ మొగులు వైపు చూడాల్సి వస్తున్నది. భూగర్భ జలం తగ్గిపోవడం, కరెంట్ కోతలు వెరసి వర్షాలు లేకపోవడంతో రైతులకు తీవ్రమైన అగచాట్లు ఎదురవుతున్నాయి. వానకాలం కావడంతో అత్యధిక శాతం మంది రైతన్నలంతా వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. ఇందులో భాగంగా వరి నారుమడులు వేసుకునేందుకు సమాయత్తం అవుతుండగా నీళ్ల కొరతతో వెనుకడుగు వేస్తున్నారు. కేవలం బాన్సువాడ నియోజకవర్గ పరిధిలో మాత్రమే వరినాట్లు మొదలయ్యాయి. మిగిలిన చోట్ల దుక్కి దున్నేందుకే రైతులు సమాలోచనలు చేస్తున్నారు. నాలుగైదు మార్లు కురిసిన చిన్నపాటి వానలకు దుక్కి దున్నేందుకు కూడా పొలాలు అనుకూలంగా లేకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

–నిజామాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

**సీజన్** ప్రారంభంతోనే నైరుతి రుతుపవనాల రాక మొదలైందన్న ప్రచారం జోరుగా వినిపించింది. భారీ వానలు కురుస్తాయన్న అంచనాలు సైతం ప్రభుత్వవర్గాలు విడుదల చేశాయి. చిరుజల్లులతో కూడిన వానలు పడడంతో రైతన్నలంతా పంటల సాగుకు ఢోకా లేదనుకొని సిద్ధమయ్యారు. బాల్కొండ నియోజకవర్గంలో చాలా మంది సోయాబీన్ విత్తుకున్నారు. పదిహేను రోజుల క్రితం నుంచి చినుకు జాడ లేకపోవడంతో విత్తిన సోయా ఎటూ కాకుండా పోతున్నది. మొలకెత్తాల్సిన సోయాబీన్ పత్తా లేకపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది. సోయాబీన్ పంటల సాగుకు నడుం బిగించిన వారంతా పెట్టిన పెట్టుబడి డబ్బులు కూడా చేతికి రాక, సీజన్ ఆరంభంలోనే నష్టాలు చవిచూడడంతో తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఇలా చాలా చోట్ల పంటల సాగుపై వర్షాభావ పరిస్థితులు రైతులను దెబ్బతీస్తున్నాయి. నెలన్నర రోజుల క్రితమే యాసంగి పంట ఉత్పత్తులను అమ్ముకొని వానకాలం పంటల సాగుకు సిద్ధమైన వారంతా వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. నిరాశజనకమైన వాతావరణ పరిస్థితుల మూలంగా ఏమీ చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ గడ్డు పరిస్థితిలో వ్యవసాయ శాఖ అధికారులు అండగా నివాల్సిన అవసరం ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదు. రైతులకు సలహాలు, సూచనలు అందివ్వాల్సిన ఏఈవోలు, ఏవోలు మిన్నకుండి పోవడంతో రైతులు నిలువునా నష్టాలను మూట కట్టుకోవాల్సిన దుస్థితి దాపురిస్తున్నది.

### అంతటా లోటు వర్షపాతమే...

నిజామాబాద్ జిల్లాలో సగానికి ఎక్కువ మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. మొత్తం 33మండలాలకు కేవలం మూడు మండలాల్లోనే అత్యధిక వర్షపాతం నమోదైంది. ఎనిమిది మండలాల్లో సాధారణ వర్షపాతం ఉండగా 13 మండలాల్లో లోటు వర్షపాతం, 9 మండలాల్లో తీవ్రమైన దుర్భిక్షమే కొట్టుమిట్టాడుతున్నట్లుగా ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. నందిపేట, నవీపేట, సిరికొండ మండలాలు మినహాయిస్తే మిగిలిన అన్ని మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. జూన్ 1 నుంచి నేటి వరకు నిజామాబాద్ జిల్లాలో సరాసరి సాధారణ వర్షపాతం 65.4 మిల్లీమీటర్లు ఉండగా కేవలం 44.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. 21.5శాతం లోటు వర్షపాతం కొనసాగుతున్నది. కామారెడ్డి జిల్లాలోనూ ఇదే దుస్థితి నెలకొన్నది. 24మండలాల్లో సేకరించిన వివరాల ప్రకారం జూన్ 1 నుంచి ఇప్పటి వరకు కామారెడ్డి జిల్లాలో సరాసరి సాధారణ వర్షపాతం 73.6 మిల్లీ మీటర్లు ఉండగా 63.7 మి.మీల వర్షం కురిసింది. 13.4శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు అధికారిక వర్గాల నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇందులో నాగిరెడ్డిపేట, తాడ్వాయి మండలాల్లో అతిభారీ వర్షాలు కురవగా, బిచ్కుంద, లింగంపేట, రామారెడ్డి మండలాల్లో భారీ వర్షపాతం నమోదైంది. ఏడు మండలాల్లో సాధారణం, తొమ్మిది మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. నస్రుల్లాబాద్, బాన్సువాడ, దోమకొండలో వర్షపు నీటి చుక్క దిక్కులేదు.

### రైతులు తొందరపడొద్దు..

మంచి వర్షాలు కురిసే వరకు రైతులు వేచి చూడడం ఉత్తమం. వాతావరణ పరిస్థితుల ప్రకారం, వ్యవసాయాధికారుల సలహాలతో రైతులు ముందుకు వెళ్లాలి. చలక భూముల్లోపై పొరలు మాత్రమే తడిసేంత వానలు ప్రస్తుతానికి కురిశాయి. తిరిగి ఎండలు కొట్టగానే భూమిలో తడి ఆరిపోయే ప్రమాదం ఉంటుంది. అరకొర వానలతోనే రైతులు తొందరపడి సోయాబీన్, మక్కజొన్న విత్తుకుంటే నష్టపోయే అవకాశం ఉంటుంది. కనీసం 8 నుంచి 10 సెం.మీటర్లు మేర భూమి తడిసిన తర్వాతనే విత్తు కోవడం ఉత్తమం. బోర్ల కింద వరినాట్లు వేసేవారు కూడా జాగ్రత్తగా అందుబాటులో ఉన్న వనరులు, భూగర్భ జలాన్ని అంచనా వేసుకుంటూ నాట్లు వేసుకోవాలి. లేదంటే మధ్యకాలిక, స్వల్పకాలిక వరి వంగడాలను ఎంచుకోవడం ఉత్తమం.

**- వాజిద్ హుస్సేన్, డీఏవో, నిజామాబాద్**



## 'విద్యుత్ ప్రజావాణి'కి 21 ఫిర్యాదులు

కంఠేశ్వర్, జూన్ 17: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించిన విద్యుత్ ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 21 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్‌ఈ ఆర్ రవీందర్ తెలిపారు. ఉదయం సెక్షన్ సబ్ డివిజన్, సాయంత్రం ఎస్‌ఈ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించామన్నారు. నిజామాబాద్ డివిజన్‌లో రెండు, డిచ్‌పల్లిలో ఐదు, ఆర్మూర్‌లో ఐదు, బోధన్‌లో తొమ్మిది ఫిర్యాదులు వచ్చాయని, అన్నింటినీ పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. ఎస్‌ఈ కార్యాలయంలో రవీందర్, టెక్నికల్ డీఈ వెంకటరమణ, ఎన్‌ఏవోఎం రాజశేఖర్, కమర్షియల్ ఏడీ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కరెంటు కోతలు ఎక్కువగా అవుతున్నాయని ప్రజావాణిలో తెలిపినట్లు సమాచారం



ఎస్‌ఈ రవీందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యుత్ వినియోగదారుడు

## ఐడియా.. అదిరింది



**కూలీల కొరత,** ఖర్చు, సమయం ఆదా చేసుకునేందుకు ఓ రైతు వినూత్న యంత్రాన్ని ఉపయోగిస్తున్నాడు. దీంతో ఏడుగురు చేయాల్సిన పనిని ఒక్క యంత్రమే చేస్తున్నది. డొంగ్లీ మండలంలోని లింబూర్ గ్రామ శివారులో సోయాబీన్ విత్తడానికి ఓ రైతు ఆధునిక యంత్రాన్ని ఉపయోగిస్తున్నాడు. పాత పద్ధతిలో ఎకరం సోయాబీన్ విత్తడానికి ఆరు నుంచి ఏడుగురు కూలీలు అవసరం ఉండేది. వారికి సుమారు రూ.2వేల వరకు కూలి డబ్బులు వెచ్చించాల్సి వచ్చేది. ప్రస్తుతం ఈ ఆధునిక యంత్రం ఒక మనిషి సహాయంతో రోజుకు రెండు ఎకరాల వరకు విత్తనాలు వేస్తున్నది. సరైన మధ్యదూరాన్ని పాటిస్తుండడంతోపాటు సమయం, ఖర్చు ఆదా అవుతుందని రైతు పేర్కొన్నాడు. ఈ యంత్రాన్ని సోయాబీన్, వేరుశనగ, మక్కజొన్న తదితర పంటలకు ఉపయోగించవచ్చని చెబుతున్నారు.

- డొంగ్లీ, జూన్ 17

ఎల్లారెడ్డి దవాఖానలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావ్



## ఎల్లారెడ్డిలో ఐటీ కారిడార్‌కు గ్రీన్‌సిగ్నల్

### ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావ్

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 17: ఎల్లారెడ్డిలో 50 ఎకరాల్లో ఐటీ కారిడార్ నిర్మించేందుకు గ్రీన్‌సిగ్నల్ పడిందని, ఆర్డీవో 50ఎకరాల స్థలం చూయించగానే ఐటీ కారిడార్ పనులు ప్రారంభమవుతాయని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదర్‌మోహన్‌రావ్ అన్నారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకు ఎన్నికలు, రాజకీయాలు మాట్లాడామని, ఎన్నికలు ముగిసినందున ఇకనుంచి ఎల్లారెడ్డి అభివృద్ధిపై ఫోకస్ పెడతామని, అభివృద్ధి పనులే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. రూ.వెయ్యి కోట్లతో ఎల్లారెడ్డిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసే వరకు విశ్రమించబోనన్నారు.

### పేదలకు కార్పొరేట్ తరహా వైద్యం అందించాలి


లక్షలాది రూపాయలు వెచ్చించి పేదలు ప్రైవేటు దవాఖానల్లో చికిత్స తీసుకోలేరని, వారికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ దవాఖానల్లోనే కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావ్ సూచించారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డుల్లో తిరుగుతూ రోగులతో ముచ్చటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దవాఖానలో తాగునీరు, సానిటేషన్, ఎక్స్ రే, సిబ్బంది కొరత తదితర సమస్యలు ఉన్నాయని, పరిష్కరించేందుకు వైద్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. అతి త్వరలోనే సమస్యలను పరిష్కరించి ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానను జిల్లాలోనే నంబర్ వన్ స్థానంలో నిలుపుతామన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్ మోహన్, జడ్పీటీసీ ఉషాగౌడ్, నాయకులు ఉన్నారు.

మద్యం మత్తులో ఉన్నాడని సీపీకి అందిన ఫిర్యాదు

గతంలోనూ చోరీ కేసులో తలదూర్చడంతో సస్పెన్షన్

## పెట్రోలింగ్‌కు వెళ్లి ప్రజలతో సీసీఎస్ సీఐ గొడవ?

వినాయక్‌నగర్, జూన్ 17 : నిజామాబాద్ కమిషనరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న సీసీఎస్ సీఐ కొన్ని నెలల క్రితం ఓ చోరీ కేసులో దర్యాప్తు పేరుతో కేసులో తలదూర్చడంతో సస్పెన్షన్‌కు గురయ్యాడు. తాజాగా పెట్రోలింగ్ చేసేందుకు వెళ్లి స్థానికులతో గొడవకు దిగడంతో ఇతర సిబ్బంది ద్వారా ఈ విషయం సీపీ దృష్టికి వెళ్లింది. సదరు సీఐపై సీపీ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. తోటి పోలీసు సిబ్బంది కథనం ప్రకారం.. సీసీఎస్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఓ సీఐ ఆదివారం రాత్రి నగర శివారులోని ఐదో టౌన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహించేందుకు వెళ్లాడు. మఫ్టీలో ఉన్న సదరు సీఐ బాబన్‌సహాబ్ పహాడ్ ప్రాంతానికి వెళ్లి.. స్థానికులతో ఆయన గొడవకు దిగాడని తెలిసింది. గొడవపడిన సమయంలో యువకులు పెద్ద మొత్తంలో ఘటనా స్థలానికి చేరుకొని సీఐని నిలదీశారు. ఆ సమయంలో ఆయన మద్యం సేవించి ఉన్నట్లు స్థానికులు గుర్తించి తిరగబడే ప్రయత్నం చేశారు. అదే సమయంలో ఐదవ టౌన్ ఎస్సై పెట్రోలింగ్ చేస్తూ అటు వైపు వెళ్లగా.. సీఐతో వాగ్వాదానికి దిగిన వారిని చెదరగొట్టాడు. సీఐ మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు గుర్తించగా.. ఈ విషయం సీపీ దృష్టికి వెళ్లింది. సీపీ సదరు సీఐని హైదరాబాద్ గాంధీ దవాఖానకు చికిత్స నిమిత్తం పంపించారు. సదరు సీఐ ఎన్నికలకు ముందు సైతం ఓ చోరీ కేసులో దర్యాప్తు పేరుతో తలదూర్చడంతో సీఐని సస్పెండ్ చేశారు. మరోమారు సీఐపై ఆరోపణలు రావడంతో శాఖా పరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.



నిజామాబాద్‌లో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

కామారెడ్డిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

## భక్తిశ్రద్ధలతో బక్రీద్

**ఉమ్మడి నిజామాబాద్** జిల్లాలో బక్రీద్ సందర్భంగా సోమవారం ముస్లిములు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్యాగానికి ప్రతీకగా ఈద్-ఉల్-జుహా(బక్రీద్)ను ముస్లిములు జరుపుకొంటారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని ఆయా ఈద్గాలు, మసీదుల వద్ద ప్రార్థనలు చేశారు. మత గురువులు ముస్లిములకు బక్రీద్ సందేశాన్ని వినిపించారు. ముస్లిములకు ప్రభుత్వ అధికారులు, రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.